సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



యుద్ధ ఖైదీగా ప్రకటించాలి

కేంద్ర మంత్రి అమిత్‌షాను యుద్ధ ఖైదీగా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.

- 10లో



న్యూస్‌రీల్

సివిల్స్‌లో మెరిసిన మౌనిమ

- ఆలిండియా 920వ ర్యాంకు సొంతం



దేపావత్ మౌనిమ

హాలియా : యూపీఎస్సీ మంగళవారం ప్రకటించిన సివిల్స్ -2024 ఫలితాల్లో అనుముల మండలంలోని వీర్లగడ్డ తండాకు చెందిన దేపావత్ మౌనిమ ఆలిండియా 920వ ర్యాంకు సాధించారు. వీర్లగడ్డతండాకు చెందిన దేపావత్ లచ్చిరాం కుటుంబం హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో స్థిరపడింది. లచ్చిరాం హైదరాబాద్ జీహెచ్ఎంసీ కమిషనర్ పనిచేస్తూ.. అకాల మరణం చెందారు. ఆయన భార్య సుజాత టీచర్‌గా పని చేస్తున్నారు. వీరి కుమార్తె దేపావత్ మౌనిమ హైదరాబాద్‌లో ఇంటర్ పూర్తి చేసి బీటెక్ ఐఐటీ చెన్నైలో చదివింది. 2023లో స్టాఫ్ సెలక్షన్ కమిటీ పరీక్షలో ఆడిట్ ఆఫీసర్‌గా ఎంపికై అకౌంట్ జనరల్ ఆఫ్ హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో మౌనిమ ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ పరీక్ష రాసి 920వ ర్యాంకు సాధించింది. మౌనిమ అన్న రాహుల్ నాయక్ హైదరాబాద్‌లో బిల్డర్‌గా పని చేస్తున్నారు. సివిల్స్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన దేపావత్ మౌనిమను గ్రామస్తులు, బంధువులు అభినందించారు.

41 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

భువనగిరిటౌన్ : జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా ఎండలతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోడ్లపై జనాలు కూడా కనిపించడం లేదు. జిల్లాలో 10 ప్రాంతాల్లో 41 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంగళవారం అత్యధికంగా బీబీనగర్, రామన్నపేట, గుండాల మండలాల్లో 42 డిగ్రీలు నమోదు కాగా మిగతా మండలాల్లో 41 డిగ్రీలు నమోదైంది.

మెరుగుపడిన ఫలితం

ఇంటర్మీడియట్‌లో 62.96 శాతం ఉత్తీర్ణత

- గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత శాతం
- ఫస్టియర్‌లో 58.54 శాతం, సెకండియర్‌లో 67.92 శాతం పాస్
- మరోసారి బాలుర కంటే బాలికలదే పైచేయి



జంపాల ఉషశ్రీ
994 ((ఎంపీసీ)



కుంటల శ్రీనయనరెడ్డి
991 (బైపీసీ)

(చౌటుప్పల్ తెలంగాణ బాలికల గురుకుల కళాశాల)

సాక్షి, యాదాద్రి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో యాదాద్రి భువనగిరి జిల్లా మెరుగుపడింది. గత సంవత్సరం 54.43 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా.. ఈసారి 62.96 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఈసారి కూడా అబ్బాయిల కంటే అమ్మాయిలే పైచేయి సాధించారు. మొదటి సంవత్సరంలో 58.54 శాతం, ద్వితీయ సంవత్సరంలో 67.92 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

సెకండియర్‌లో బాలురు 52.43 శాతం, బాలికలు 72.38 శాతం ఉత్తీర్ణత

జిల్లాలో 65 కళాశాలలు ఉన్నాయి. 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 22 ప్రైవేట్, 16 ప్రభుత్వ, ప్రైవేట్ ఒకేషనల్, కేజీబీవీ, మోడల్, రెసిడెన్షియల్, గురుకులాలు, 32 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరానికిగాను 5,529 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 2,899 మంది ఉత్తీర్ణత సాధించారు. 52.43 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ ఏడాది 2024-25లో 62.96 శాతంతో గతేడాదికంటే ఈ సారి ఉత్తీర్ణత శాతం పెరిగింది. జిల్లా వ్యాప్తంగా 6,208 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 3684 మంది పాస్ కాగా.. 58,54 ఉత్తీర్ణత శాతం సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 5,830 మంది విద్యార్థులకు 3,756 మంది పాస్ కాగా.. 67.92 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. మొదటి సంవత్సరంలో బాలురు 48.88 శాతం, బాలికలు 67.52 శాతం, ద్వితీయ సంవత్సరంలో బాలురు 52.43 శాతం, బాలికలు 72.38 శాతం ఉత్తీర్ణులయ్యారు.

రాష్ట్ర స్థాయిలో 14వ స్థానం

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ ఫలితాల్లో జిల్లా ర్యాంకు మెరుగుపడింది. గత సంవత్సరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 19వ స్థానం, ద్వితీయ సంవత్సరంలో 22 వస్థానంలో నిలిచింది. ఈ సారి మాత్రం ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 14వ స్థానంలో నిలిచింది.

ప్రత్యేక తరగతులు నిర్వహించాం

గతంలో కంటే ఈ సారి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం పెరగడానికి కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాం. విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశాం. కళాశాల హాజరు శాతం పెంచేందుకు విద్యార్థుల తల్లిదండ్రులను మోటివేట్ చేశాం. – రమణి డీఐఈఓ

సంవత్సరం	విద్యార్థులు	పాసైనవారు	శాతం
2014- 15	5,914	2,832	47.8
2015- 16	6,216	3,116	50.12
2016- 17	6,395	3,556	56
2017- 18	6663	4,034	61
2018- 19	5,046	2,730	54
2019- 20	7,523	7,523	100
2020- 21	9,363	9,363	100
2021- 22	14,011	8,438	60.22
2022- 23	12,647	7,256	57
2023- 24	11,867	6,467	54.50
2024- 25	11,738	7,390	62.96



భూ భారతితో భూమికి మరింత భద్రత

- కలెక్టర్ హనుమంతరావు

చౌటుప్పల్ : భూ భారతి చట్టంతో భూమికి మరింతగా భద్రత లభిస్తుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణిలో పరిష్కారం జరగని సమస్యలన్నీ భూ భారతిలో పరిష్కారం అవుతాయన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. చౌటుప్పల్‌తోపాటు నారాయణపురం మండలాల్లోని పోడు భూముల సమస్యలను సైతం పరిష్కరించాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి, మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయాధికారి నాగరాజు, మార్కెట్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సిద్ధార్థకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

త్వరలో యాదాద్రి క్షేత్రానికి స్వయం ప్రతిపత్తి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ ట్రస్ట్ బోర్డుకు ప్రభుత్వం వేగంగా కసరత్తులు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కేబినెట్ సమావేశంలో యాదగిరి క్షేత్రానికి ధర్మకర్త మండలి ఏర్పాటు చేయాలని మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ఆలయానికి ముందస్తుగా స్వయం ప్రతిపత్తిగా కల్పిస్తూ ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు రానున్నట్లు తెలిసింది. స్వయం ప్రతిపత్తి తరువాత ధర్మకర్త మండలిని ఏర్పాటు చేస్తారని ఆలయ అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ధర్మకర్తల మండలి కోసం పలువురు పోటీ పడుతున్నారు.

ఎన్నో ఏళ్ల భూ సమస్యలకు భూ భారతితో పరిష్కారం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, కలెక్టర్ హనుమంతరావు

సాక్షి, యాదాద్రి, వలిగొండ : ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన భూ సమస్యలకు భూభారతితో పరిష్కారం లభించనుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం వలిగొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ భారతి(రికార్డ్ ఆఫ్ రైట్స్) చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. భూ భారతి చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు నాలుగు జిల్లాల్లో ఒక్కో మండలాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి అన్ని జిల్లాల్లో ఒక్కో మండలం ఎంపిక చేసి పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ.. భూభారతి చట్టంలో అప్పీల్ వ్యవస్థ ఉండడం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. చట్టం అమలు చేసేందుకు తహసీల్దార్లు రెవెన్యూ సిబ్బందితో గ్రామాలకు వస్తారని, దరఖాస్తులు స్వీకరించడమే కాకుండా పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తారని పేర్కొన్నారు.

కోట్లాది మంది రైతులకు మేలు

ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. భూ భారతితో కోట్లాదిమంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. భువనగిరి నియోజకవర్గానికి అదనంగా మరో 2వేల ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలో శిథిలావస్థకు భువనగిరి, పోచంపల్లి, వలిగొండ తహసీల్దార్ కార్యాలయాలకు సొంత భవనాలు మంజూరు చేయాలన్నారు. వలిగొండలో నూతనంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన భూ సమస్యలను పరిష్కరించడానికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక చట్టం భూభారతి అని అన్నారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. భూ భారతిపై పూర్తి అవగాహన పెంచుకుని అవసరమైన సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, భువనగిరి మార్కెట్ చైర్మన్ రేఖా బాపురావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేశ్ చిస్తి, వలిగొండ మార్కెట్ చైర్మన్ భీమా నాయక్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్ రెడ్డి, చిట్టెడి వెంకట్ రాం రెడ్డి, భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పోత్నక్ ప్రమోద్ కుమార్, తంగెళ్లపెల్లి రవికుమార్, వాకిటి అనంతరెడ్డి పాల్గొన్నారు.

గోడు వెళ్లబోసుకున్న బాధితులు

వలిగొండకు చెందిన రైతు మారగోని నర్సింహ ధరణి కారణంగా తన భూమి 1954 నుంచి వారసుల పేరున పట్టా ఉండి, కొంత కాలం క్రితం తమ పేరున నమోదైందని, కానీ ధరణిలో మారక పోవడంతో కొత్త పాస్‌పుస్తకం రాలేదని తెలిపాడు. భూ భారతితోతో సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. అక్కంపల్లికి చెందిన మహిళా రైతు బుంగపట్ల సరళ భర్త చనిపోవడంతో ఆయన పేరున ఉన్న భూమి ఈమె పేరున మార్చడానికి అధికారులు సమస్యలు చూపుతున్నారని, భూ భారతిలో సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని వేడుకుంది.



క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

భువనగిరి : ఇంటర్‌లో ఫెయిల్ అయినందుకు మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామానికి చెందిన రాసాల మల్లేష్, సునిత దంపతుల చిన్నకుమారుడు అఖిలేష్ యాదవ్(17) భువనగిరి పట్టణంలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం(ఎంపీసీ) చదువుతున్నాడు. మంగళవారం విడుదలైన ఫలితాలలో అతడు రెండు సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యాడు. ఈ విషయాన్ని తెలుసుకుని అఖిలేష్ మనోవేదనకు గురయ్యాడు. సాయంత్ర ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యవసాయ పనులకు వెళ్లిన తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి వచ్చి తలుపులు తీసి చూడగా అఖిలేష్ ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే అతనిని భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు తెలిపారు.

ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ..

- పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదు

హుజూర్‌నగర్: ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాసి పట్టుబడగా.. ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ చరమంద రాజు తెలిపిన వివరాల ప్రకారం .. మేళ్లచెరువు మండలం రేవూరు గ్రామనికి చెందిన బండారు వీరబాబు ఓపెన్ ఇంటర్ అడ్మిషన్ వేశాడు. ఆదివారం నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాగా.. వీరబాబుకు హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సెంటర్ పడింది. తనకు బదులు పరీక్షలు రాస్తే ప్రతి పరీక్షకు రూ.1000 ఇస్తానని వీరబాబు తన బంధువు అరిగెల చిరంజీవికి చెప్పాడు. ఇందుకు చిరంజీవి ఒప్పుకొని మంగళవారం పొలిటికల్ సైన్స్ పరీక్ష ఉండగా.. వీరబాబు హాల్‌టికెట్ తీసుకొని వెళ్లి పరీక్ష రాస్తున్నాడు. ఈ క్రమంలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పిన్ని మధుకి చిరంజీవిపై అనుమానం వచ్చి విచారించగా నిజం ఒప్పుకున్నాడు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బండారు వీరబాబు, అరిగెల చిరంజీవిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

సూర్యాపేటటౌన్: ఈతకు వెళ్లి చెరువులో మునిగి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట మండలం గాంధీనగర్‌లో మంగళవారం జరిగింది. సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన సుద్దాల భిక్షం, ఉపేంద్ర దంపతుల కుమారుడు కిషోర్(14) మంగళవారం స్నేహితులతో కలిసి ఈత నేర్చుకోవడానికి స్థానికంగా ఉన్న చెరువు వద్దకు వెళ్లాడు. స్నేహితులతో పాటు కిషోర్ కూడా చెరువులోకి దూకాడు. ఈత రాకపోవడంతో చెరువులో మునిగి మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువులో నుంచి కిషోర్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువకుడి బలవన్మరణం


భాను (ఫైల్)

ఆలేరురూరల్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలేరు మండలం కొలనుపాకలో మంగళవారం జరిగింది. కొలనుపాక గ్రామానికి చెందిన గజరాజు భాను(21) గ్రామంలోనే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. భాను తల్లి మృతిచెందగా.. తండ్రి వేరే ఉంటున్నాడు. భాను అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం భాను గ్రామంలోని సోమేశ్వర ఆలయం వెనక చెరువు కట్ట వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని ఎస్ఐ రజనీకర్ తెలిపారు. మృతుడు అవివాహితుడు.

డిగ్రీ పరీక్షలపై నీలినీడలు !

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వాలంటున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు
- పరీక్షలు నిర్వహించలేమని చేతులెత్తేసిన వైనం
- పరీక్షలను వాయిదా వేసిన ఎంజీయూ
- అటానమస్ డిగ్రీ కళాశాలల్లో కొనసాగుతున్న పరీక్షలు
- పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారోనని ఎదురుచూస్తున్న విద్యార్థులు



నల్లగొండ టూటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు ఫీజు రీయిబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో డిగ్రీ పరీక్షలు నిర్వహించలేకపోతున్నామని కళాశాలల యాజమాన్యాలు మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు మొరపెట్టుకున్నాయి. గత నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని 64 కాలేజీలకు సుమారుగా రూ.100 కోట్లు రావాల్సి ఉంది. ఫీజు బకాయిల కారణంగా విద్యార్థులకు జరగాల్సిన డిగ్రీ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ నెల 2 నుంచి జరగాల్సిన ప్రాక్టికల్స్‌ను నిర్వహించలేమని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు చెప్పినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. దీంతో మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 11 నుంచి డిగ్రీ పరీక్షలు జరుగాల్సి ఉండగా వాయిదా వేస్తున్నట్లు ఎంజీయూ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రకటించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి నడుస్తున్న గ్రామీణ ప్రాంత ప్రైవేట్ డిగ్రీ కాలేజీల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే గత 8 నెలల నుంచి కాలేజీలో విద్యాబోధన చేస్తున్న అధ్యాపకులకు జీతాలు ఇవ్వకపోవడంతో తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ సైతం పరీక్షల నిర్వాహణకు సహకరించబోమని ఎంజీ యూనివర్సిటీ అధికారులకు తేల్చి చెప్పారు. మే నెలలోగా డిగ్రీ పరీక్షలు పూర్తి చేయాల్సి ఉంది. డిగ్రీ పూర్తిచేసిన వారు జూన్‌లో పీజీ ఎంట్రన్స్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఇప్పుడు డిగ్రీ పరీక్షలు వాయిదా పడడంతో డిగ్రీ చదివే విద్యార్థులు పైచదువులకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ డిగ్రీ కాలేజీలను పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ తీరు కారణంగా విద్యార్థుల చదువులపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు.

ఉమ్మడి జిల్లాలో 64 ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 64 ప్రైవేట్ డిగ్రీ కాలేజీలకు రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేదు. గత ప్రభుత్వం నుంచి ఈ ప్రభుత్వం వరకు డిగ్రీ కాలేజీలకు రూ.100 కోట్లు బకాయి పడింది. నాలుగు సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోతే కాలేజీలో విద్యాబోధన చేసే అధ్యాపకులకు జీతాలు, కరెంట్ బిల్లులు, ప్రైవేట్ భవనాలు అయితే వాటి అద్దె చెల్లింపులు, ఇతర నిర్వహణ ఖర్చులు ఎలా చెల్లించాలని కాలేజీల యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో గతంలో 118 ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు ఉండగా అవి ప్రస్తుతం 64కు పడిపోయాయి. పరిస్థితి ఇలాగే ఉంటే వీటిలో సగం కాలేజీలు సైతం మూతపడే పరిస్థితి ఉందని కాలేజీల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం 64 కాలేజీల్లో 25వేల మందికి పైగా విద్యార్థులు డిగ్రీ చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దశల వారీగా చెల్లించినా పరీక్షలు నిర్వహించేందుకు తాము సిద్ధమని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయి.

అటానమస్ కళాశాలల్లో కొనసాగుతున్న పరీక్షలు

ఉమ్మడి జిల్లాలో నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరి, కోదాడ పట్టణాల్లో ఉన్న అటానమస్ డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులకు డిగ్రీ పరీక్షలు నడుస్తున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో దాదాపు 20వేలకు పైగానే విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రం డిగ్రీ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారని ఆందోళన చెందుతున్నారు.

బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలి



గ్రామీణ ప్రాంత డిగ్రీ కాలేజీలు ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ పైనే ఆధారపడి నడుస్తున్నాయి. అధ్యాపకుల జీతాలు ఇవ్వకపోవడంతో వారు సహకరించడంలేదు. ప్రభుత్వం తమ పరిస్థితి అర్థం చేసుకొని దశల వారీగానైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలి.

– మారం నాగేందర్‌రెడ్డి, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు

అమిత్‌షాను యుద్ధ ఖైదీగా ప్రకటించాలి

- మావోయిస్టులను అంతమొందిస్తామనడం సరైంది కాదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


మోత్కూరులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న కూనంనేని సాంబశివరావు

మోత్కూరు: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను యుద్ధ ఖైదీగా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. 2026 మార్చి నాటికి మావోయిస్టులను అంతమొందిస్తానని మాట్లాడటం ఏమిటని, చట్టాన్ని కాపాడవలసిన వారే ఎలా మాట్లాడతారని ఆయన ప్రశ్నించారు. సీపీఐ భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం మోత్కూరులోని కేఆర్ భవన్‌లో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో కూనంనేని పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మావోయిస్టులను అంతమొందిస్తామనడం సరైన విధానం కాదని, వారిని చర్చలకు పిలవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశాన్ని విభజించడం కోసం బీజేపీ ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే.. జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ స్థానాల పునఃర్విభజన యత్నం అని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే దేశ ద్రోహులని, అర్బన్ నక్సలైట్లని ముద్ర వేస్తున్నారని అన్నారు. మతాన్ని ముందుపెట్టి ప్రజలను మభ్యపెడుతూ ఓట్లు అడుగుతూ అధికారంలోకి రావడమే లక్ష్యంగా నరేంద్ర మోదీ పనిచేస్తున్నారని విమర్శించారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వైఫల్యం చెందారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అవగాహన రాహిత్యంతోనే పొత్తు సక్రమంగా జరుగకపోవడంతో అత్యధిక పార్లమెంట్ స్థానాలను బీజేపీ కై వసం చేసుకుందన్నారు. బీజేపీ సింగిల్ ఎజెండాగా మతప్రాతిపదికన పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. దేశంలో ముస్లిం, క్రిస్టియన్, కమ్యూనిస్టులను బీజేపీ శత్రువులుగా చూస్తోందని విమర్శించారు. ప్రమాదకరమైన బీజేపీకి వ్యతిరేకంగా, పదేళ్ల పాలనలో ప్రజలను మోసగించిన బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పొత్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. ధర్నాలకు అనుమతి ఇవ్వకపోవడం, ప్రజా ఆందోళన చేసే వారిని ముందస్తుగా అరెస్టు చేయడాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. బీఆర్ఎస్ తరహాలో పాలన కొనసాగించవద్దని కాంగ్రెస్‌కు హితవు పలికినట్లు తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురుమిద్ద శ్రీనివాస్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాశికంటి లక్ష్మీనర్సయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు చేడె చంద్రయ్య, నాయకులు కళ్లెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, ఉప్పల ముత్యాలు, కుసుమ హరిశ్చంద్ర, బండి జంగమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మొగుళ్ల శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలి

ఆలేరురూరల్: ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలని మూడు నెలల నుంచి సీపీఐ ఆధ్వర్యంలో నిరుపేదలతో కలిసి భూపోరాటం చేస్తున్న వారిని మంగళవారం ఆయన కలిసి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యేతో చర్చించి ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు ఇప్పించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట ఆరుట్ల ఫౌండేషన్ చైర్మన్ ఆరుట్ల సుశీల, చెక్క వెంకటేష్, చౌడబోయిన కనకయ్య తదితరులు ఉన్నారు.

మోటారు కేబుల్ వైరు దొంగల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ సాయిప్రశాంత్

తిప్పర్తి: వ్యవసాయ బావుల వద్ద మోటారు కేబుల్ వైర్లు చోరీ చేస్తున్న ఇద్దరిని మంగళవారం తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దసూరారం గ్రామానికి చెందిన కోట్ల జలేంధర్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద ఈ నెల 20న 160 మీటర్ల మోటారు కేబుల్ వైరు చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం నార్కట్‌పల్లి–అద్దంకి హైవేపై తిప్పర్తి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని రాంనగర్‌కు చెందిన అన్నపురి రవి, సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం చందుపట్ల గ్రామానికి చెందిన శిగ ఉపేందర్ మోటర్ సైకిల్‌పై అనుమానాస్పదంగా వెళ్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిని పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకొని విచారించగా.. తిప్పర్తి మండలంలోని రాయినిగూడెం, తిప్పర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని తిప్పలమ్మగూడెంలో మోటారు కేబుల్ వైర్లను అపహరించినట్లు అంగీకరించారు. వారి వద్ద రూ.53,800 విలువ గల కేబుల్ వైరు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. చోరీ చేసిన కేబుల్ వైర్లను నల్లగొండ పట్టణంలో వల్లందాసు ఎల్లయ్య నడిపిస్తున్న పాత ఇనుప సామాను దుకాణంలో అమ్మేవారని, అతడు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రైతు మహోత్సవంలో 'కుంకుడుకాయ' స్టాల్


లోకసాని పద్మారెడ్డి స్టాల్‌లో కుంకుడుకాయల ఉత్పత్తులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్‌లో నిర్వహిస్తున్న రైతు మహోత్సవం రైతుల్లో ఉత్సాహం నింపుతోంది. సోమవారం ప్రారంభమైన ఈ మహోత్సవం బుధవారంతో ముగియనుంది. ఈ సమ్మేళనంలో రైతులు వివిధ అంశాలపై అవగాహన కలిగేలా ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. నల్లగొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లికి చెందిన రైతు లోకసాని పద్మారెడ్డి 12 ఎకరాల్లో కుంకుడు కాయతోట సాగుచేయడమే కాకుండా ప్లాంట్ ఏర్పాటు చేసి వాటితో షాంపూలు, డిష్‌వాష్, హ్యాండ్‌వాష్, ఫ్లోర్ క్లీనర్, సిరామిక్ కేర్ లిక్విడ్, ఆల్ ఇన్ వన్ అగ్రికల్చర్ ప్రొడక్ట్ (ఎరువుగా వాడేది) తయారు చేస్తున్నారు. ఈ ఉత్పత్తులను భారీగా ఎగుమతి చేస్తున్నట్లు పద్మారెడ్డి సోదరుడు వెంకట్‌రెడ్డి తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ


బాధితురాలు బానోత్ గోమి

హుజూర్‌నగర్‌రూరల్: మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామ శివారులో చోటుచేసుకుంది. మంగళవారం ఎస్ఐ ముత్తయ్య, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెర్వు మండలం ఎర్రగట్టు తండాకు చెందిన బానోతు గోమి హుజూర్‌నగర్‌లోని అడ్డా మీదకు వచ్చి కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తోంది. మంగళవారం మిర్యాలగూడ రోడ్డులోని అడ్డా వద్ద పనికోసం వేచి చూస్తున్న ఆమె వద్దకు గుర్తుతెలియని వ్యక్తి వచ్చి గోపాలపురం గ్రామంలో ఇసుక జల్లెడ పట్టే పని ఉందని, కూలీ రూ.700 ఇస్తానని చెప్పి ఆమెను బైక్‌పై ఎక్కించుకుని గోపాలపురం గ్రామానికి చేరుకున్నాడు. గ్రామం దాటిన తర్వాత చెరువు కట్టకు వెళ్లే డొంక దారిలోకి తీసుకెళ్లి బైక్‌ను ఆపి అన్నం తిన్నావా అంటూ ఆమెను మాటల్లో పెట్టి.. మంచినీటి బాటిల్ ఇచ్చి నీళ్లు తాగమన్నాడు. గోమి నీళ్లు తాగుతుండగా ఆమె మెడలోని సుమారు తులం బంగారు గొలుసును లాక్కొని బైక్‌పై పారిపోయాడు. బాధితురాలు హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.6లక్షల నగదు, మూడు తులాల బంగారం అపహరణ

దేవరకొండ: తాళం వేసిన ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారం, నగదు అపహరించారు. ఈ ఘటన మంగళవారం దేవరకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో జరిగింది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండలోని హనుమాన్‌నగర్‌కు చెందిన రమేష్ వ్యాపారం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రమేష్, అతడి భార్య కలిసి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో దాచిన రూ.6లక్షల నగదు, మూడు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. రమేష్ ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండటం గమనించి పోలీసులుకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్వర్ణగిరీశుడికి రథోత్సవ సేవ

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం శ్రావణ నక్షత్రం సందర్భంగా రాత్రి స్వామివారికి రథోత్సవ సేవ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన, నిత్య కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం సుమారు మూడు వేల మందికి అన్నప్రసాదం వితరణ, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


రథోత్సవ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన


సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై వరి ధాన్యం తగులబెట్టి నిరసన తెలుపుతున్న రైతులు

- రోడ్డుపై ధాన్యం తగులబెట్టి రైతుల నిరసన


రైతుల నిరసనతో నిలిచిపోయిన వాహనాలు

చివ్వెంల(సూర్యాపేట): ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుర్రతండాలో రైతులు మంగళవారం ఆందోళన చేశారు. సూర్యాపేట–దంతాలపల్లి రోడ్డుపై ముళ్ల కంచె వేసి ధాన్యాన్ని దహనం చేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి 20 రోజులు అవుతున్నా కాంటాలు వేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో 12 వేల క్వింటాళ్ల ధాన్యం ఉంటే కేవలం 3వేల క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని, కాంటా వేసిన బస్తాలు కూడా లోడ్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే బస్తాలు మొత్తం తడుస్తాయన్నారు. రెండు లారీలు లోడ్ వేసి పంపిస్తే తిరిగి రావాడానికి నాలుగు రోజుల పడుతుందన్నారు. మిల్లర్లు అన్‌లోడ్ చేసుకోవడంలో ఆలస్యం చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి మిల్లర్లతో మాట్లాడి, ఎక్కువ మిల్లులకు ట్యాగింగ్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డుపై ట్రాఫిక్ స్థంభించిపోవడంతో పోలీసులు, తహసిల్దార్ వచ్చి రైతులతో మాట్లాడి రాస్తారోకో విరమింప జేశారు. సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు గుర్రంతండాను సందర్శించి రైతులతో మాట్లాడి, మిల్లులకు ట్యాగింగ్ ఇప్పించి వెంటనే మూడు లారీల్లో కాంటా వేసిన ధాన్యంను ఎగుమతి చేయించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెంటర్ నిర్వాహకులు చూడాలని ఆదేశించారు.

చిట్యాలలో వరుసగా బైక్ చోరీలు

- దుకాణాల ముందు పార్కింగ్ చేసిన బైక్‌లను ఎత్తుకెళ్లిన దొంగలు


సీసీ కెమెరాల్లో రికార్డయిన బైక్ చోరీ దృశ్యాలు

చిట్యాల: చిట్యాల పట్టణంలో వరుసగా బైక్ చోరీలు జరుగుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని భువనగిరి రోడ్డులో గల బాలాజీ స్వీట్ హౌజ్ ఎదుట షానూర్ అనే యువకుడు తన పల్సర్ బైక్‌ను పార్కింగ్ చేసి వెళ్లాడు. అర్ధగంట తర్వాత వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. స్వీట్ హౌజ్‌లోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా ఓ యువకుడు బైక్‌ను చోరీ చేసినట్లు కనిపించింది. బాధితుడు చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురానికి చెందిన చిర్రబోయిన శివ సోమవారం సాయంత్రం చిట్యాల పట్టణంలోని విజయవాడ–హైదరాబాద్ హైవే పక్కన గల సిరి వైన్స్ ఎదుట తన హీరో ప్యాషన్ బైక్‌ను నిలిపి వైన్స్‌లోకి వెళ్లాడు. పది నిమిషాల తర్వాత వచ్చి చూసేసరికి బైక్ చోరీకి గురైంది. రెండు రోజుల్లో వరుసగా రెండు బైక్‌లు చోరీకి గురికావడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారిపై లారీ దగ్ధం


దగ్ధమవుతున్న లారీ

మునగాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల శివారులో మంగళవారం రాత్రి 10గంటల సమయంలో లారీలో మంటలు చెలరేగి దగ్ధమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు గ్రానైట్ రాయి లోడుతో వెళ్తున్న లారీ ఇంజన్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ అప్రమత్తమై కిందకు దూకాడు. నిమిషాల వ్యవధిలో లారీ క్యాబిన్‌తో సహా పూర్తిగా దగ్ధమైంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో సుమారు రెండు కి.మీ. మేర విజయవాడ వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. ఘటనా స్థలానికి చేరుకున్న మునగాల పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఫైర్‌ఇంజన్‌తో వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు.

హనుమంతుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజ నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించారు. ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి. సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం వెండి జోడు సేవ నిర్వహించారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఆసరా

- డయాలసిస్ చేయించుకునేందుకు పెన్షన్ అందజేత
- ఉమ్మడి జిల్లాలో 893మంది డయాలసిస్ పేషెంట్లు
- గత ప్రభుత్వం నుంచే పెన్షన్ పొందుతున్నవారు 418మంది
- కొత్తగా మరో 475 మంది దరఖాస్తు


మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులు

మిర్యాలగూడ అర్బన్: ప్రజల జీవన శైలిలో మార్పు, వారి ఆహారపు అలవాట్లు వెరసి చాలా మంది కిడ్నీ సంబంధిత వ్యాధి బారిన పడుతున్నారు. ఈ కిడ్నీ వ్యాధితో బాధపడే వారికి డయాలసిస్ చేయిస్తేనే వారి జీవనం సాఫీగా సాగుతుంది. కొందరు ప్రతిరోజు డయాలసిస్ చేయించుకుంటుండగా.. మరికొందరు రోజు విడిచి రోజు, ఇంకొందరు రెండు రోజులకు లేదా వారానికి ఒకసారి డయాలసిస్ చేయించుకునే వారు ఉన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం డయాలసిస్ చేయించుకునే రోగులకు ప్రత్యేకంగా ఆసరా పెన్షన్ అందించింది. ప్రస్తుత ప్రభుత్వం కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆరోగ్యశ్రీలో డయాలసిస్ చేయించుకునే రోగులకు ఆసరా పెన్షన్ అందించేందుకు వీలుగా ఇటీవల ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. వారం రోజులుగా దరఖాస్తులకు అవకాశం కల్పించడంతో మరికొంత మంది డయాలసిస్ రోగుల వివరాలను ఆరోగ్యశ్రీ సిబ్బంది ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో మరికొంత మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఆసరా పెన్షన్ అందే అవకాశం ఉండగా.. ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ చేయించుకునే రోగులకు మాత్రమే ఈ అవకాశం ఉన్నట్లు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సిబ్బంది పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 19 డయాలసిస్ సెంటర్లు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 19 డయాలసిస్ సెంటర్లు ఉండగా.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 11, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎనిమిది ఉన్నాయి. ఆయా కేంద్రాలలో మొత్తం 893 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇప్పటికే 418 మంది రోగులకు ఆసరా పెన్షన్ అందుతోంది. కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించడంతో మరో 475 మంది దరఖాస్తులను ఆరోగ్యశ్రీ సిబ్బంది ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేశారు. ప్రభుత్వం దరఖాస్తులను పరిశీలించి పెన్షన్ అందిస్తే తమకు ఎంతో కొంత ఆసరాగా ఉంటుందని డయాలసిస్ రోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.